ఘనంగా సదర్ సమ్మేళనం



సదర్ సంబురాల్లో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

ఎల్బీనగర్, నవంబర్ 2: నాగోలు గ్రామంలో సదర్ సంబురాలను ఘనంగా నిర్వహించారు. నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, యువ నాయకుడు చింతల కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం ప్రతినిధులు సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాండ్ మేళాలు, దున్నపోతులను సుందరంగా అలంకరించి యువకుల నృత్యాలతో ఈ ప్రాంతం సంబురంగా మారింది. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, అర్బన్‌బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డితో పాటుగా పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి

ఆర్కేపురం, నవంబర్ 2 : విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారులు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఆపరేషన్ సరూర్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్ సబ్ డివిజన్ కార్యాలయం నందు ఆదివారం సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సరూర్‌నగర్ విద్యుత్‌శాఖ డీఈ కె.కె.రామకృష్ణ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలతో పాటు బిల్లుల హెచ్చుతగ్గుల విషయంపై ఫిర్యాదు చేసి తగిన పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేంకటేశ్వర ఆలయంలో అగ్ని ప్రమాదం

మాదన్నపేట, నవంబర్ 2: సంతోష్‌నగర్ లోని శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారని సీఐ నాగరాజు తెలిపారు. దేవాలయంలోని అద్దాల మేడలోని మంటలు వ్యాపించాయని, పోలీసులు సకాలంలో స్పందించడంతో ఆస్తి నష్టం జరగలేదని దేవాదాయ శాఖ అధికారి ఈఓ మహేందర్ తెలిపారు.

గుర్రపు డెక్కను తొలగించండి

చందన చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్1: చెరువుల్లో ఉన్న గుర్రపు డెక్కను తొలగించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మంత్రాల చెరువు, చందన చెరువు, పెద్ద చెరువులను అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. చెరువు చుట్టూ పక్కల కాలనీ వాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే చెరువులను పరిశీలించారు. చెరువుల్లో గుర్రపు డెక్క ఉండటం వలన దోమలు విపరీతంగా పెరగడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారని కాలనీ వాసులు తెలిపారు. హెచ్ఎండీఏ అధికారులకు ఎమ్మెల్యే ఫోన్ చేసి చెరువులను క్లీన్ చేయించాలని ఆదేశించారు. హెచ్ఎండీఏ అధికారులకు లిఖిత పూర్వకంగా లేక రాశారు. గుర్రపు డెక్కను తొలగించడానికి అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపెన్ జిమ్‌లలో పరికరాలు పాడై పోతున్నాయని, వాటిని రిపేర్ చేయించాలన్నారు. ప్రతి రోజు వందల మంది వాకింగ్ చేస్తున్న వారికి ఇబ్బందవుతుందన్నారు. డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఆర్వో చంద్ర శేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు అర్కల భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి, సిద్ధాల భరత్, ప్రభాకర్ రెడ్డి, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

లో ప్రెషర్ లేకుండా తాగునీటి సరఫరాకు చర్యలు

మ్యాన్‌హోల్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న డీజీఎం సయ్యద్ హస్మత్ అలీ

మలక్‌పేట, నవంబర్ 2: మలక్‌పేట డివిజన్-1 పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా లో ప్రెషర్ సమస్యలు లేకుండా తాగునీటిని సరఫరా చేసేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని మలక్‌పేట జల మండలి డివిజన్-1 డీజీఎం సయ్యద్ హస్మత్ అలీ తెలిపారు. సలీంనగర్‌లోని మసీదు సమీపంలో కొనసాగుతున్న తాగునీటి పైపులైన్, మ్యాన్‌హోల్ మరమ్మతు పనులను డివిజన్ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలకు తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. ఎక్కడ ఎలాంటి సమస్య లున్నా డివిజన్ మేనేజర్‌కుగానీ, తన దృష్టికిగానీ తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు. కలుషిత నీరు తాగునీటిలో కలువ కుండా, లీకేజీలు లేకుండా పైపులైన్లకు, మ్యాన్‌హోళ్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడు తున్నామని వెల్లడించారు. తాగునీటి లైన్లపై నిత్యం పర్యవేక్షణ ఉం టుందని, సిబ్బంది అన్ని కాలనీల్లో పర్యటిస్తూ పైపులైన్లను పరిశీలిస్తున్నారని వివరించారు. మూసారాంబాగ్ డివిజన్ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మురుకుంట్ల అరవింద్‌శర్మ

కేటీఆర్ పాదయాత్రకు సంపూర్ణ మద్దతు

ఆర్కేపురం, నవంబర్ 2 : కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనకు చరమ గీతం పాడి, ప్రజల గొంతుకగా కేటీఆర్ చేయనున్న పాదయాత్రకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ తెలిపారు. శనివారం ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపూరిత 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ఏ ఒక్క హామీని అమలు చేయకుండా పబ్బం గడుపుతుందన్నారు. హైడ్రా పేరిట అమాయక ప్రజల ఇండ్లపై బులోజర్లను పంపి వారి బతుకులను రోడ్డు పాలు చేశారని విమర్శించారు. మూసీ పక్షాళన పేరిట లక్షల కోట్లు దోచి ఢిల్లీ పెద్దలకు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. పది నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పది సంవత్సరాలు వెనుకకు పోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలోని ఏ ఒక్క వర్గం ప్రజలు సంతోషంగా లేరన్నారు. పది సంవత్సరాల కేసీఆర్ పరిపాలనలో రాష్ట్రం కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు పాలనను గాలికొదిలేసి అవినీతికి ఎగబడ్డారన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మాజీ మంత్రి కేటీఆర్ పాదయాత్ర చేస్తామని చెప్పడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కేటీఆర్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానని ప్రకటించడంతో బీజేపీ, కాంగ్రెస్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు వణుకు పుడుతుందని విమర్శించారు.

అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానం



అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 2: మన్సూరాబాద్ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రసన్న ప్రియ అయ్యప్ప భక్త సమాజం వారి సౌజన్యంతో అయ్యప్ప మాలధారులకు నిత్య అన్న ప్రసాదాన్ని అందించే కార్యక్రమాన్ని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. అయ్యప్ప మాలధారణ చేసి నిత్యం పూజల్లో ఉండే అయ్యప్ప భక్తులకు 55 రోజుల పాటు మన్సూరాబాద్ అయ్యప్ప ఆలయంలో నిత్యం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని వారు తెలిపారు. డిసెంబర్ 26 వరకు కొనసాగుతుందన్నారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, రాజిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, చలపతిరెడ్డి, జగదీశ్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

శారదానగర్‌లో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబర్ 2 : డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్‌లోని శారదానగర్‌లో కొనసాగుతున్న నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కాలనీవాసులకు పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేసిన వెంటనే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీసీ రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టాలని అధికారులకు వివరించారు. ఆయన వెంట జలమండలి మేనేజర్ వాహిని, సూపర్‌వైజర్ బాలునాయక్, కాలనీవాసులు నర్సింహా రావు, యాదగిరి, నాయకులు పారంద మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మెడలో బంగారు గొలుసు చోరీ

హయత్‌నగర్, నవంబర్ 2 : వ్యక్తి మెడలో తులంన్నర బంగారు చైన్‌ను తెంపుకుని పరారైన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కోహెడకు చెందిన తాటిచెట్టు భిక్షపతి శనివారం మధ్యాహ్నం పెద్దఅంబర్‌పేట నుంచి కోహెడకు వెళ్లే రోడ్డులో నారాయణ కళాశాలకు ఎదురుగా రోడ్డు పక్కన కల్లును విక్రయిస్తున్నాడు. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి దగ్గరికి వచ్చి కల్లు ధర వివరాలు అడుగుతూ మొహంపై కారంపొడి చల్లి భిక్షపతి మెడలోని తులంన్నర బంగారు చైన్‌ను తెంపుకుని పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొ కబడ్డీలో సత్తా చాటిన విద్యార్థులు

విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు శంకర్ నాయక్, మమత

ఎల్బీనగర్, నవంబర్ 2: ప్రొ కబడ్డీ జూనియర్స్ విభాగంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మండలంలోని నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి తమ విభాగంలో చాంపియన్స్‌గా నిలిచారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రొ కబడ్డీ జూనియర్స్‌లో 32 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించారు. గ్రూపు సీలో 8 జట్లు తలపడగా నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమంగా రాణించి ప్రథమ స్థానంలో నిలిచారు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ప్రొ కబడ్డీ జూనియర్స్‌లో ఫైనల్ మ్యాచ్‌లో కర్మన్‌ఘాట్ స్టేట్ స్కూల్‌పై నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. తెలంగాణ నుంచి జాతీయ స్థాయి ప్రొ కబడ్డీ జూనియర్స్‌కు నాలుగు జట్లు అర్హత సాధించగా వాటిలో నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. త్వరలో మహారాష్ట్రలోని పూణేలో జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. నాగోలు ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్ లక్ష్మీ దేవి, ఫిజికల్ డైరెక్టర్స్ శంకర్ నాయక్, మమతల పర్యవేక్షణలో శిక్షణ పొందిన దినేశ్, రోహిత్ సంజయ్, తిలక్, రాజేశ్, రంజిత్ కుమార్, హరీశ్, రవీందర్ నాయుడు, నవదీప్, అఖిల్, ధీరజ్, లిక్సన్, పాండు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం (నోసా) అధ్యక్షుడు కందికంటి ఖన్నా గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, పాఠశాల హెడ్మాస్టర్ లక్ష్మీదేవి, రవికుమార్ అభినందించారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ,తదితరులు

ఎల్బీనగర్, నవంబర్ 2: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ప్రొ కబడ్డీ జూనియర్స్ విభాగంలో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన హైదరాబాద్ అంచెలో గ్రూపు సీ విభాగంలో ప్రథమ స్థానం సాధించి పూణేలో జరుగనున్న జాతీయ స్థాయి ప్రొ కబడ్డీ జూనియర్స్ పోటీలకు అర్హత సాధించిన నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను శనివారం అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ నాగోలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో చాంపియన్‌లుగా నిలిచారని కొనియాడారు. నాగోలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో పదికి పది గ్రేడ్ మార్కులు సాధించిన వారికి రూ. 10వేల నగదుతో పాటుగా గోల్డ్ మెడల్‌తో తాను సత్కరిస్తానని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రొ కబడ్డీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, నోసా ప్రతినిధులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఇటీవలే ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఉత్తమంగా రాణించి రాష్ట్ర స్కూల్ గేమ్స్ జట్టుకు ఎంపికైన నాగోలు పాఠశాల విద్యార్థి సిద్దార్థ్‌ను సన్మానించారు. హెచ్ఎం లక్ష్మీ దేవి, ఉపాధ్యాయులు రవికుమార్, విమల, ఫిజికల్ డైరెక్టర్లు శంకర్ నాయక్, మమత, వెంకటేశ్, శ్రీదేవి, సుధాకర్ పాల్గొన్నారు

కరుణాకర్‌రావుకు ఆత్మీయ వీడ్కోలు

కరుణాకర్‌రావును సత్కరిస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, నబంబర్ 2 : పేద ప్రజలకు మైరుగైన వైద్య సేవలను అందించటంలో దవాఖాన ఉద్యోగుల పాత్ర ఎనలేనిదని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శనివారం మలక్‌పేట ఏరియా దవాఖాన అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కరుణాకర్ రావు ఉద్యోగ విరమణ సందర్భంగా దవాఖాన ఆవరణలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖాన అభివృద్ధిలో పనిచేసే వైద్యులు, సిబ్బంది పాత్ర కీలకంగా ఉంటుందని, పనిచేసిన కాలంలో ఉద్యోగులు పోషించిన పాత్రను, సేవలు ఉద్యోగ విరమణ తర్వాత సహచర ఉద్యోగులు, సిబ్బంది గుర్తుంచుకుంటారని అన్నారు. దవాఖాన అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా కరుణాకర్‌రావు దవాఖాన అభివృద్ధికి చేసిన సేవలను ప్రశంసించటంతోపాటు ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఆయన సేవలను ఉపయోగించుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రావు దంపతులను ఎమ్మెల్యే బలాల శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. వివిధ దవాఖానలకు చెందిన వైద్యులు, సహా ఉద్యోగులు, మిత్రులు తదితరులు పాల్గొని కరుణాకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దవాఖాన పర్యవేక్షణాధికారి త్రిలోక్ శ్యామ్, ఆర్ఎంవో డాక్టర్ సురేశ్, వైద్యులు మల్లికార్జున్, లింగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి...

దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన సేవలను అందించే విధంగా పనిచేయాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శనివారం మలక్‌పేట ఏరియా దవాఖాన అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు ఎదుర్కొంటున్న సమస్యలను సతర్వమే పరిష్కరించటానికి కృషిచేయాలని, రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలను కల్పించాలన్నారు. దవాఖానలో వైద్యుల, సిబ్బంది వివరాలను తెలుసుకొని అవసరమైన సిబ్బంది, వైద్యుల నియామకానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అక్బర్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ మినాజుద్దీన్, దవాఖాన పర్యవేక్షణాధికారి డాక్టర్ త్రిలోక్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సదర్ మేళా సోదరభావాన్ని పెంపొందిస్తుంది

దున్నల యజమానులకు మెమొంటోలను అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

సైదాబాద్, నబంబర్ 2 : సైదాబాద్‌లో నిర్వహించే యాదవ సదర్ మేళాకు ఎంతో విశిష్టత కలిగి ఉందని కల్వకుర్తి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్ అన్నారు. సైదాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సైదాబాద్ ప్రధాన రహదారిపై నిర్వహించిన సదర్ మేళాకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. పాతబస్తీలో కుల, మతాలకు అతీతంగా సదర్ ఉత్సవాలను జరుపుకుంటూ మతసామరస్యాన్ని పాటిస్తున్నారన్నారు. యాదవులు తమ దున్నలను, జంతువులను అందంగా అలంకరించి సదర్ ఉత్సవాలను జరుపుకోవటం ఎంతో సంతోషాన్ని ఐక్యతను పెంచుతుందన్నారు. సదర్ ఉత్సవాలు వారిలో సోదర భావాన్ని, ఐక్యతను పెంచటానికి ఎంతోగాను దోహద పడుతాయని వారు అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్ యాదవ్, దూది మెట్ల బాల్‌రాజ్ యాదవ్, బార్ కౌన్సిల్ సభ్యులు చలకని వెంకట్‌యాదవ్, జీహెచ్ ఎంసీ కార్పొరేటర్లు, యాదవ మహాసభ సభ్యులు, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

హయత్‌నగర్,నవంబర్ 2: విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయడం అభినందనీయమని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ అంజనీ దేవి అన్నారు. శనివారం హయత్‌నగర్ బ్రాంచి(సాయినగర్) శ్రీచైతన్య స్కూల్‌లో మ్యాక్సివిజన్ శ్రీమహాలక్ష్మి సూపర్ స్పెషాలిటీ కంటి దవాఖాన ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రాలను కాపాడుకోవాలన్నారు. కంటి సమస్యలు ఏర్పడినప్పుడు వెంటనే డాక్టర్లను సంప్రదించాలని ఆమె విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య స్కూల్ ఏజీఎం సతీష్ , అకాడమిక్ డీన్ రఘుపతి, సీ బ్యాచ్ ఇన్‌చార్జి సోమయ్య,ఏవో ప్రమోద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇనాం భూమి దళితులకు దక్కాలి

మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్

కందుకూరు, నవంబర్ 2 : మండల పరిధిలోని నేదునూరు గ్రామంలో గల ఇనాం భూమి దళితులకు దక్కాలని సీపీఎం మండల కార్యదర్శి బుడ్డీరపు శ్రీనివాస్ తెలిపారు. ఆ భూమిని గ్రామ పార్టీ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకోవడానికి భూ పోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ఆ భూమిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 154సర్వే నంబరులో 1 : 35 ఎకరాల భూమి ఉందని 1993 వరకు దళితులు పహానీలో పట్టా కాలంలో ఉన్నారని పేర్కొన్నారు. ఆ భూమిని అదే గ్రామానికి చెందిన మునగల వెంకట్‌రెడ్డి ఎలాంటి ఫైల్ నంబరు లేకుండా పట్టా కాలంలో పేరు ఎక్కించుకొని కబ్జా చేసినట్లు తెలిపారు. దళితులు, పేదలు, ఒక్కటై సీపీఎం ఆధ్వర్యంలో భూమిని స్వాధీనం చేసుకోవడానికి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. దళితులకు దక్కాల్సిన భూమిని రికార్డుల పరంగా అధికారులు అప్పగించాలని కోరారు. పోరాటం చేస్తున్న అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డులను మార్పిడి చేసి దళితులకు చెందాల్సిన భూమిని కబ్జా చేయడం ఎంత వరకు సమంజసమని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి దళితుల పేరిట రికార్డుల్లో ఎక్కించి వారికి న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల మాజీ కార్యదర్శి అంకగాల్ల కుమార్, గ్రామ కార్యదర్శి మిద్దె యాదయ్య, ఆదిరాల నర్సింహ, బొర్ర సురేశ్, రంగని నర్సింహ, నాగాలి శ్రీహరి, శివాని నర్సింహ, భిక్షపతి, గోపని జగన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీహరి

కందుకూరు, నవంబర్ 2 : భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సమాజ్ వాది పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటికల శ్రీహరి కోరారు. కందుకూరు డివిజన్‌కు నూతనంగా వచ్చిన ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం, బాలాపూరు, సరూర్‌నగర్ మండలాల్లో అనేక భూ సమస్యలు ఉన్నాయని వాటిని గుర్తించి పరిష్కరించాలని కోరారు. భూ సమస్యలను తన దృష్టికి తేవాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి వారికి సూచించారు.

జనావాసాల మధ్యకు వచ్చిన నెమలి

నెమలిని చాదర్‌ఘాట్ ఎస్ఐ రవిరాజ్‌కు అప్పగిస్తున్న మహ్మద్ అమ్జద్

మలక్‌పేట, నవంబర్ 2: జనావాసాల మధ్యకు వచ్చిన జాతీయ పక్షి నెమలిని గమనించిన పాన్‌షాప్ యజమాని పట్టుకొని చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. శనివారం మధ్యాహ్నం ఆజంపురాలోని చాదర్‌ఘాట్ లోయర్ బ్రిడ్జి వద్ద నెమలిని గమనించిన స్థానిక పాన్‌షాప్(అహ్‌దియ దూద్ ఘర్ పాన్‌షాప్) వ్యాపారి మహ్మద్ అమ్జద్ నెమలిని పట్టుకొని చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించగా, వారు జూ పార్కు అధికారులకు అప్పగించారు. అమ్జద్‌ను పోలీసులు అభినందించారు.

యువకుడు అదృశ్యం

నాగభూషణ్ (ఫైల్)

కందుకూరు, నవంబర్ 2 : యువకుడు అదృశ్యమైన ఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సైదులు కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా దారూర్ మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన బాలయ్య కుమారుడు కావాలి నాగభూషణ్ జీవనోపాధి కోసం కందుకూరులోని ఎస్ వీవీ వెంబర్‌లో సూపర్ వైజర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 29వ తేదీన గ్రామానికి వెళ్లడానికి రామాజీపేటకు వెళ్లే బస్సు ఎక్కి ఇంటికి వెళ్లలేదు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వ్యక్తుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. అంతే కాకుండా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు